
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 18 ఆగస్టు 2025



22 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



నరసరావుపేటలో కొలువైన గణపతి విగ్రహాలు

చవితి సందడికి ఏర్పాట్లు

- వినాయక చవితికి ముస్తాబవుతోన్న గణనాథులు

(నరసరావుపేట, సత్తెనపల్లి, ఆంధ్రజ్యోతి)

వినాయక చవితి సమీపిస్తోంది. చవితి పందిళ్లలో కొలువు తీరేందుకు వివిధ రూపాల్లో గణనాథులు సిద్ధమవుతున్నారు. చవితి సందడికి పల్లెలు, పట్టణాలు సిద్ధమవుతున్నారు. వాడ వాడలా గణపతి ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీలు, భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకంగా పందిళ్లను నిర్మించే పనులు మొదలు పెట్టారు. నరసరావుపేట, సత్తెనపల్లి సమీపంలోని వెన్నాదేవి తదితర ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను కళాకారులు రూపొందిస్తున్నారు. చవితి పర్వదినం సమీపిస్తుండంతో తయారీదారులు వేగం



పెంచారు. అడుగున్నర నుంచి 20 అడుగుల ఎత్తు వరకు వివిధ రూపాల్లో వినాయకుడి ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. విగ్రహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. రాజస్థాన్‌కు చెందిన కళాకారులు వివిధ ఆకృతుల్లో రూపొందించిన వినాయక విగ్రహాలు. భక్తులను ఆకర్షిస్తున్నాయి. వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులు తాము నెలకొల్పే విగ్రహం ఆకర్షణీయంగా, మిగిలిన పందిళ్లలో కంటే భిన్నంగా ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో విగ్రహాల ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. విగ్రహం ఎత్తు, ఆకృతిని బట్టి ధర నిర్ణయించి బుకింగ్ చేసుకుంటున్నారు. కొంత మంది అడ్వాన్స్ ఇచ్చి వెళ్తున్నారు.



మట్టి పరీక్షలు మమ



రైతులకు ఎంతో ఉపయోగపడే.. భూసారం తెలియజేసే.. పంటల సాగుకు సద్వినియోగమయ్యే.. దిగుబడులు పెంచే మట్టి పరీక్షలపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతుల పొలాల్లోని మట్టి సేకరించి పరీక్షలు చేసి భూసారాన్ని నిర్ధారించి రైతులకు భూ ఆరోగ్య కార్డులు ఇవ్వాలి. తదనుగుణంగా రైతులు పోషకాల వినియోగంతో పాటు ఏ పంటలు సాగు చేయాలో నిర్ధారించు కుంటారు. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వ్యవసాయశాఖ మట్టి పరీక్షల విషయంలో స్పందించడం లేదు. సిబ్బంది.. పరీక్షలకు అవసరమైన పరికరాల కొరత పేరుతో మట్టి సేకరణ.. పరీక్షల నిర్వహణ.. ఆరోగ్య కార్డుల పంపిణీ తూతూమంత్రంగా చేస్తోంది. పంటల సాగుకు ముందే అందించాల్సిన భూసార కార్డులు ముద్రణ స్థాయిలోనే ఉన్నాయంటే రైతులకు సంబంధించిన విషయాల్లో అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. పంట సాగు పూర్తయ్యే లోపైనా రైతులకు ఆరోగ్య కార్డులు అందించే పరిస్థితులు కనిపించడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- భూసార పరీక్షలపై నిర్లక్ష్యం
- పరీక్షల లక్ష్యం 60,100.. పూర్తి 31,598
- భూ ఆరోగ్య కార్డుల పంపిణీ అరకొరగానే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో గుర్తించి.. ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులకు వ్యవసాయశాఖ తెలియజేయాలి. ఇందుకు భూసార పరీక్షలు కీలకం. అయితే ఖరీఫ్ సాగు ప్రారంభమై వారాలు గడుస్తున్నా నేటికీ భూసార పరీక్షలు పూర్తి కాలేదంటే వీటిపై వ్యవసాయ శాఖకు ఉన్న చిత్తశుద్ధి తెలి యజేస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మట్టి పరీక్షల లక్ష్యం 60,100 కాగా ఇప్పటికి 31,598 మట్టి నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన భూసార పత్రాలను అందించడంలో కూడా అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతోంది. సాగు ప్రారంభం కాక మునుపే రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే ఆచరణలో అది అమలుకు నోచుకోలేదు. సాధారణ విస్తీర్ణంలో ఇప్పటికే 50 శాతం పంటల (మిగతా 7వ పేజీలో)



సేకరించిన మట్టి నమూనాలు

ముద్రణలోనే కార్డులు

పల్నాడు జిల్లాలో 23,437 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా 23,043 సేకరించారు. వీటిలో 14,077 నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో లక్ష్యం మేర 13,862 మట్టి నమూనాలను సేకరించినా 7,455 పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 22,801 నమూనాలను సేకరించగా 10,066 పరీక్షలు పూర్తయ్యాయి. ఆయా కార్డుల పంపిణీ ముద్రణ స్థాయిలోనే ఉంది.

సాగర్ వద్ద సందడి

- 22 క్రస్ట్‌గేట్ల ద్వారా జాలువారుతోన్న కృష్ణమ్మ
- సోయగాలు తిలకించేందుకు తరలివచ్చిన పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పరవళ్లు తొక్కుతూ కృష్ణమ్మ ప్రవహిస్తోంది. నాగార్జున సాగర్ జలాశయం నుంచి 22 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను తలకించేందుకు సెలవు దినమైన ఆదివారం పెద్దసంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది పర్యాటకులు సాగర్‌ను తిలకించేందుకు తరలివచ్చారు. దీంతో సాగర్ నూతన వంతెన, పాత



వంతెన, ప్రధాన డ్యాం వద్ద సందడి నెలకొంది. చిన్నారులు, యువత కేరింతలు కొడుతూ ప్రాజెక్ట్ వద్ద సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. రాత్రి వేళ విద్యుత్ లైట్ల వెలుగులో ప్రాజెక్ట్ అందాలు పర్యాటకులను కట్టిపడేశాయి. పర్యాటకులు రాకతో ఎత్తిపోతల నుంచి సాగర్ ప్రాజెక్ట్ రహదారి వాహనాలతో రద్దీగా మారింది. పర్యాటకులు నాగార్జున కొండను సందర్శించారు. పర్యాటకులు నాగసిరి, శాంతిసిరి, అగస్త్య లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల అందాలను కూడా వీక్షించారు.

ఇన్‌ఫ్లో 1,45,076 క్యూసెక్కులు

సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద కొనసాగుతూనే ఉంది. ఆదివారం శ్రీశైలం నుంచి 1,45,076 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 22 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. జలాశయం నీటిమట్టం 586.70 అడుగులు ఉంది. కుడి కాల్వ ద్వారా 6006, ఎడమ కాల్వ ద్వారా 3667, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,867, 22 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,70,588, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లోగా 2,11,820 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



వరికపూడిశెలను పూర్తి చేస్తా

ట్రాక్టర్లపై ర్యాలీగా మార్కెట్‌యార్డుకు తరలివస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

- రైతుల ఆర్థికాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- అన్నదాత కృతజ్ఞత ట్రాక్టర్ల ర్యాలీలో ఎంపీ లావు
- దగాకోరు ధర్నాలతో జగన్‌రెడ్డి కుట్రలు : ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల వరికపూడిశెల పూర్తి చేయడమే తన లక్ష్యమని.. లేకుంటే పదేళ్ల రాజకీయ జీవితం వ్యర్థమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని విజయవంతంగా అమలు చేసిన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మాచర్లలో ఆదివారం రైతులు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 500 ట్రాక్టర్లతో రైతులు మాచర్లకు ర్యాలీగా తరలివచ్చారు. శ్రీశైల రోడ్డులోని శ్రీపెద్దాంజనేయస్వామి దేవస్థానం నుంచి మార్కెట్‌యార్డు వరకు ట్రాక్టర్ల ర్యాలీ జరిగింది. ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు స్వయంగా ట్రాక్టర్లు నడిపి రైతులను సంతోషపరిచారు. అనంతరం మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ వరికపూడిశెలతో పాటు జల్‌జీవన్ మిషన్ వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేస్తే మాచర్ల ప్రాంత ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతు ఉత్పత్తులను మార్కెట్‌యార్డులకు తరలించేందుకు అనువుగా రహదారుల నిర్మాణాలకు రూ.2500 కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలవుతున్నాయని, రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ రైతు సంక్షేమానికి తిలోదకాలు వదిలి రైతులను దగా చేసిన దగుల్బాజి జగన్‌రెడ్డి అని అన్నారు. జగన్‌రెడ్డి రద్దు చేసిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం తిరిగి అమలు చేస్తుందని గుర్తుచేశారు. బూటకపు ఓదార్పులు, దగాకోరు ధర్నాలతో జగన్‌రెడ్డి కుట్రలకు పాల్పడుతున్నారని, వాటిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు.



మాచర్ల పట్టణంలో ట్రాక్టర్ల ర్యాలీ

ముమ్మరంగా.. వరి నాట్లు

ఎకరానికి రూ.4,300 వ్యయం

పిడుగురాళ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనంతో వర్షాలు.. నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటి విడుదలతో రైతులు ఆలస్యంగా ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. గత కొన్ని రోజులుగా ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని తంగెడ, ఆకురాజుపల్లె మేజర్ పరిధిలో వరి నాట్లు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే జూలకల్లు, పందిటివారి పాలెం, వీరాపురం, పిల్లుట్ల, మల్లవోలు, మోర్జంపాడు సమీపాలతో పాటు దాచేపల్లి, గురజాల మండలాల్లోని పలు గ్రామాలలో వరినాట్లు వేశారు. అన్ని ప్రాంతాల్లో రైతులందరూ ఒకేసారి నాట్లు ప్రారంభించడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో కూలీలు ఎకరం నాటు వేసినందుకు రూ.4,300 డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో కూలీలు అడిగినంత ఇచ్చి నాట్లు వేయించుకుంటున్నారు.



అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

- యాప్‌లు, రికార్డుల నిర్వహణతో బెంబేలు
- లక్ష్యాలకు దూరంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ
- రికార్డుల నిర్వహణ రద్దు జీవో వచ్చినా తప్పని భారం
- పనిచేయని ఫోన్లతో సతమతం..
- అధికారులకు సరెండర్

యాప్‌ల మోత.. రికార్డుల భారం.. పనిచేయని మొబైల్స్‌తో విధుల నిర్వహణపై అంగన్వాడీలు బెంబేలెత్తిపోతున్నారు. అమ్మో అంగన్వాడీ ఉద్యోగమా అంటూ పలువురు విముఖత చూపుతున్నారు. తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో ఉద్యోగమంటేనే భయపడే పరిస్థితి అంగన్వాడీల్లో నెలకొంది. తాము పనిచేయ లేమంటూ ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల మొబైల్ ఫోన్లను అధికారులకు పలువురు సరండర్ చేశారు.



గుంటూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమంలో అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమైనది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 5,295 కేంద్రాల ద్వారా 3 లక్షలమంది గర్భిణులు, బాలింతలు, లక్షన్నర మంది చిన్నారులకు పోషణ అందించడంతోపాటు, వారి సంక్షేమం విష యంలో అంగన్వాడీలది కీలకపాత్ర. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బలవర్థక ఆహారాన్ని అందించడంతో పాటు, చిన్నారులకు ప్రీ స్కూలు విద్యను కూడా వీరు అందించాలి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల (మిగతా 7వ పేజీలో)



రంగురాళ్ల ప్రచారాల్ని నమ్మొద్దు

- తరలివస్తున్న వారికి పోలీసుల కౌన్సెలింగ్

నకరికల్లు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని త్రిపురాపురం కొండ వద్ద రంగు రాళ్లు దొరుకుతాయనే ప్రచారాన్ని నమ్మవద్దని ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. పల్నాడు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు కొండ వద్దకు తరలివచ్చి రంగురాళ్ల కోసం గాలిస్తున్నారు. రంగురాళ్ల కోసం పెద్దసంఖ్యలో తరలివస్తున్న వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తు న్నారు. పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులు కూడా కొండ ప్రాంతంలో ప్రత్యేకంగా గస్తీ నిర్వహిస్తున్నారు. కొండ వైపు రాళ్ల కోసం ఎవ్వరూ రావద్దని, వచ్చి చిక్కుల్లో పడవద్దని తహసీల్దార్ పుల్లారావు, ఎస్ఐ సురేష్‌లు తెలిపారు. రంగు రాళ్ల కోసమని వస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.



రంగు రాళ్ళ కోసం వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్ఐ ప్రసాదు

నరసరావుపేట బరంపేటలో ఉన్న ఇస్కాన్ మందిరంలో ఆదివారం శ్రీల ప్రభుపాదులకు 108 భక్ష్యములతో మహారాజభోగ నివేదన జరిగింది. - నరసరావుపేట టౌన్



గేట్-2026

దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'గేట్-2026' షెడ్యూల్ వెలువడింది. మొత్తం 30 సబ్జెక్టు పేపర్లకు ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ ఎంట్రెన్స్‌ను గౌహతి ఐఐటీ నిర్వహిస్తోంది. ఎంట్రెన్స్‌లో సాధించిన స్కోరు, ఫలితం వెలువడిన నాటి నుంచి మూడు సంవత్సరాలపాటు వాలీడ్‌గా ఉంటుంది. ఆ స్కోరుతో మూడేళ్లలో ఎంటెక్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ తీసుకోవచ్చు.



- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 25
- **ఎంట్రెన్స్ తేదీలు:** 2026 ఫిబ్రవరి 7, 8, 14, 15
- **ఫలితాలు:** 2026 మార్చి 19
- **వెబ్‌సైట్:** http://gate2026.iitg.ac.in/

ఎలా ప్రిపేర్ కావాలి

జాతీయ స్థాయిలో అత్యంత పోటీ ఉన్న ఎంట్రెన్స్‌ల్లో 'గేట్' ఒకటి. అభ్యర్థుల టెక్నికల్ నాలెడ్జ్‌కి ప్రామాణికంగా ఈ ఎంట్రెన్స్‌ను భావిస్తుంటారు. గేట్ అత్యంత ప్రామాణికంగా ఉండడానికి కారణం దీనిని ఐఐటీలు నిర్వహించడమే. గ్రాడ్యుయేషన్ తర్వాత ఉద్యోగం చేస్తూ చాలా మంది గేట్ ఎంట్రెన్స్ రాస్తుంటారు. ప్రశ్నలపరంగా చూస్తే ఇందులో మల్టిపుల్ చాయిస్, న్యూమరికల్ తరహా ఆన్సర్, జనరల్ రిలేటెడ్ ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి ఇంజనీరింగ్ కాన్సెప్ట్‌లు, అనలిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ ఎబిలిటీస్ పరీక్షిస్తారు. గేట్ స్కోరుతో ఉన్నత చదువులే కాకుండా ఇతర అవకాశాలు కూడా ఉంటాయి.

ప్లానింగ్: గేట్ ప్రిపరేషన్ మొదలుపెట్టే ముందే ప్రస్తుత వర్క్ షెడ్యూల్‌ను పరిశీలించుకోవాలి. రోజువారీ పనులకు పోనూ ప్రిపరేషన్‌కు ఎంత సమయం కేటాయించగలం అనేది అంచనా వేసుకోవాలి. సిలబస్‌ను ముందు పెట్టుకుని సరైన పద్ధతిలో విభజించుకుని, వీక్లీ, మంత్లీ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు ఈ వారం నెలలో పూర్తి చేయాల్సిన చాప్టర్లు, లేదా సబ్జెక్టులు అని ప్లాన్ చేసుకోవాలి.

సరైన స్టడీ మెటీరియల్: అభ్యర్థి తాను రాసే ఇంజనీరింగ్ సబ్జెక్టుకు సంబంధించి సరైన మెటీరియల్‌ను ఎంచుకోవాలి. దీనికి సంబంధించి కోచింగ్ సెంటర్ల మెటీరియల్ ఉంటుంది. అలాగే చాలా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. గూగుల్‌లో సెర్చ్ చేస్తే వాటికి సంబంధించిన వివరాలు అందుబాటులోకి వస్తాయి.

మొబైల్ యాప్స్, ఆన్‌లైన్ మెటీరియల్: గేట్ అకాడమి, టెస్ట్ బుక్, గ్రేడ్‌అప్, తదితర యాప్స్‌లో స్టడీమెటీరియల్ అందుబాటులో ఉంటుంది. అలాగే మాక్‌టెస్ట్‌లు, ప్రాక్టీస్ ప్రశ్నలు లభిస్తాయి.

మాక్‌టెస్ట్‌లు: రోజు థియరీ చదవడం, ప్రశ్నలు పూరించడం చేయడంతో ప్రిపరేషన్ పూర్తయినట్లు కాదు. గత సంవత్సర ప్రశ్న పత్రాలు, మాక్ టెస్ట్‌లు రాయడం వల్ల టైమ్ మేనేజ్‌మెంట్‌తోపాటు బలహీనంగా ఉన్న చాప్టర్లను గుర్తించడం సులువు అవుతుంది. తరవాత తప్పులను పరిశీలించుకుంటే ఎక్కడ మెరుగు పరుచుకోవాలో అర్థం అవుతుంది. మాక్ టెస్ట్‌లు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.

స్ట్రెస్ మేనేజ్‌మెంట్, మోటివేషన్: ప్రిపరేషన్‌లో మోటివేషన్ ఉండాలంటే ఇప్పటి వరకు ఎంత సిలబస్ పూర్తి చేశారు అనేది పరిశీలించుకుంటూ ఉండాలి. రోజువారీ, నెలవారీ లక్ష్యాలను ఎలా అందుకున్నది చూసుకుంటే మరింత ఉత్సాహం కలుగుతుంది. మాక్‌టెస్ట్‌ల్లో లభించిన స్కోరుతో లక్ష్యాన్ని ఎంత వరకు చేరుకున్నామో అర్థం అవుతుంది. అలాగే మంచి స్టడీ గ్రూప్‌లో చేరడం, లేదా ప్రిపేర్ అయ్యే వ్యక్తులతో కలిసి చదువు సాగిస్తే మోటివేషన్ లభిస్తుంది.

అకడమిక్ అవకాశాలు

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ తరవాత విద్యార్థులకు పలు అవకాశాలు ఉంటాయి. అందులో పాపులర్ ఆప్షన్ మాత్రం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఇంజనీరింగ్.

ఇంజనీరింగ్ పీజీ

- **మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్)/ మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ):** కాల పరిమితి రెండేళ్లు. ఈ కోర్సు చేయడానికి బీటెక్/బీఈతోపాటు గేట్ స్కోరు ఉండాలి. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలతోపాటు బిట్స్ పిలానీ, డీటీయూ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ, అన్నా వర్సిటీ మొదలైనవి ఉన్నాయి.

స్పెషలైజేషన్లు: సీఎస్ఈ, ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, వీఎల్ఎస్ఐ డిజైన్, పవర్ సిస్టమ్స్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, థెర్మల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ మొదలైనవి.

- **మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్సీ)/ ఎంఎస్(రీసెర్చ్):** ఐఐఎస్సీ, ఐఐటీ, కొన్ని యూనివర్సిటీలు వీటిని అందిస్తున్నాయి. పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి ఇది సరైన కోర్సు. గేట్ లేదా ఆయా సంస్థలు పెట్టుకునే పరీక్షల ద్వారా అడ్మిషన్ లభిస్తుంది.

ఇతర అవకాశాలు

- **పబ్లిక్ సెక్టార్లో ఉద్యోగాలు:** ఓఎన్‌జీసీ, బీహెచ్ఈఎల్, ఐఓసీ, గెయిల్, డీఆర్‌డీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజస్‌లు తమ టెక్నికల్ విభాగాల్లో నేరుగా 'గేట్' ర్యాంకర్లకు ఉద్యోగాలు ఇస్తారు.
- **అంతర్జాతీయ అవకాశాలు:** 'గేట్'లో మంచి స్కోరు సాధించిన విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం లభిస్తుంది. అలాగే విదేశీ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్(ఎన్‌యూఎస్), ఈటీహెచ్ జ్యూరిచ్ తదితర విద్యా సంస్థలు 'గేట్' స్కోరును అంగీకరిస్తాయి.
- **ఇండస్ట్రీ-అకడమిక్ గుర్తింపు:** ఇండస్ట్రీ, అకడమిక్ వైపు 'గేట్' స్కోరును సబ్జెక్ట్ ఎక్సలెన్స్‌కు బెంచ్ మార్కుగా భావిస్తారు.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

దిక్సూచి

దివ్యాంగ విద్యార్థులకు..

దివ్యాంగ విద్యార్థుల కోసం సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ ఉపకార వేతనాలు అందిస్తోంది. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ గుర్తింపు పొందిన వైకల్యం ఉన్న విద్యార్థుల చదువుల కోసం 'స్కాలర్‌షిప్ ఫర్ డిజెబిలిటీస్'ను అందిస్తున్నారు. వీటిలో పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు, దేశీయ, విదేశీ చదువులు, పోటీ పరీక్షల శిక్షణ కోసం కూడా సహాయం చేస్తున్నారు.

స్కాలర్‌షిప్ రకాలు:

- **ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 9, 10 తరగతుల వారికి ఉద్దేశించింది.
- **పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 11వ తరగతి నుంచి పీజీ, డిగ్రీ, డిప్లొమా వారికి ఉద్దేశించింది.
- **టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్:** ప్రముఖ విద్యా సంస్థల్లో యూజీ, పీజీ చదువులకు ఉద్దేశించింది.
- **నేషనల్ ఫెలోషిప్:** భారతీయ యూనివర్సిటీల్లో ఎంఫిల్, పీహెచ్‌డీలకు ఉద్దేశించింది.
- **నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్:** విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీలకు ఉద్దేశించింది. అభ్యర్థులు దీనికి ఎంపికయ్యే సంవత్సరం ఏప్రిల్ 1 నాటికి 35 సంవత్సరాల లోపు ఉండాలి.
- **ఫ్రీ కోచింగ్ స్కాలర్‌సిప్:** ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోచింగ్‌లకు ఉద్దేశించింది.

అర్హత: 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ డిజెబిలిటీ ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వైకల్యానికి సంబంధించిన, యూడీఐడీ కార్డు ఉండాలి.

కుటుంబ ఆదాయం: రూ.2.5 లక్షలు(ప్రీ-పోస్ట్ మెట్రిక్ దరఖాస్తుదారులకు), రూ.8 లక్షలు(టాప్ క్లాస్, నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఫ్రీ కోచింగ్ దరఖాస్తు దారులకు), నేషనల్ ఫెలోషిప్ వారికి ఎలాంటి ఆదాయ పరిమితి లేదు. ఒకే తల్లిదండ్రుల నుంచి ఇద్దరు పిల్లలు మాత్రమే అర్హులు. కవలల విషయంలో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు: నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ధ్రువపత్రాలు: పాస్‌పోర్ట్ ఫోటో, బర్త్ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ నెంబర్, ట్యూషన్ ఫీజు రసీదు, చివరి విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతా వివరాలు.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31 **వెబ్‌సైట్:** scholarships.gov.in

స్కాలర్‌షిప్స్

గిరిజన విద్యార్థులకు..

కేంద్ర గిరిజన గిరిజన వ్యవహార శాఖ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులకు దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివేందుకు 'జాతీయ స్కాలర్‌షిప్ పథకం' అందిస్తోంది. ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్, సైన్స్ టెక్నాలజీ, హ్యూమానిటీస్, లా, సోషల్ సైన్స్ వంటి విభాగాల్లో చదువుకు ఏడాదికి 2.50 లక్షలతోపాటు ఇతర ఆర్థిక సహాయం పొందవచ్చు.

స్కీమ్ పేరు: జాతీయ గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యా పథకం(టాప్ క్లాస్ స్కాలర్‌షిప్)

అర్హత: అభ్యర్థులు గిరిజన వర్గానికి చెందిన వారై ఉండాలి. మంత్రిత్వశాఖ ప్రకటించిన ప్రముఖ విద్యా సంస్థలో డిగ్రీ, పీజీలో ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం ఆరు లక్షల లోపు ఉండాలి. ఒకే కోర్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరో స్కాలర్‌షిప్ పొందుతూ ఉండరాదు.

ధ్రువపత్రాలు: గిరిజన సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అడ్మిషన్/ఫీజు రసీదు, ఆధార్ లింక్ చేసిన బ్యాంక్ పాస్‌బుక్, అర్హత పరీక్ష సర్టిఫికెట్/మార్క్‌షీట్, బోనఫైడ్ సర్టిఫికెట్



దరఖాస్తు: ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్, అవసర పత్రాల్ అప్‌లోడ్ తరువాత మంత్రిత్వశాఖ ధ్రువీకరణ పొందాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

వెబ్‌సైట్: scholarships.gov.in

నౌకాదళంలో ఉద్యోగాలు

భారత నౌకాదళంలో గ్రూప్ 'సీ' నాన్ గెజిటెడ్, 1266 ఇండస్ట్రియల్ ట్రేడ్స్‌మెన్ స్కిల్డ్ ఖాళీల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎక్స్‌నేవల్ అప్రెంటిస్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. వయస్సు 18 నుంచి 25 సంవత్సరాల లోపు ఉండాలి.

ట్రేడులు: సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంట్, మెషిన్ తదితరాలు.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 2

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో జనరలిస్ట్ ఆఫీసర్లు

మొత్తం పోస్టులు 500

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 500 జనరలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

విద్యార్హతలు: కనీసం 60 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ వారికి 55 శాతం చాలు. చార్టర్డ్ అకౌంటెంట్ ఉత్తీర్ణతతోపాటు, అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 22 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ

పరీక్ష విధానం: 150 మార్కులకు ఆబ్జెక్టివ్ పరీక్ష ఉంటుంది. ఇందులో 20 మార్కులు ఇంగ్లిష్, 20 మార్కులు క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, 20 మార్కులు రీజనింగ్, 90 మార్కులు ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కి ఉంటాయి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ **చివరి తేదీ:** 2025 ఆగస్ట్ 30

వెబ్‌సైట్: https://bankofmaharashtra.in/

చిరు ప్రయత్నం ఫలించేనా?

- సమ్మె నేపథ్యంలో చిరంజీవిని కలసిన చిన్న నిర్మాతలు
- మెగాస్టార్ శుభవార్త చెబుతానన్నారు: నిర్మాత నట్టికుమార్
- నేడు ఫెడరేషన్‌తో చిరంజీవి చర్చలు?

తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన కార్మికుల వేతన పెంపు సమస్య తన పరిధిలో లేదనీ, దానిపై ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయమే అంతిమం అని చిరంజీవి గతంలో సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే రెండు వారాలుగా టాలీవుడ్ కార్మికుల సమ్మె కొనసాగుతున్నా ఇప్పటివరకూ ఫిల్మ్ ఛాంబర్ కానీ, నిర్మాతలు కానీ సమస్యకు పరిష్కారం సాధించలేకపోయారు. దీంతో టాలీవుడ్ పంచాయితీ మళ్లీ మెగాస్టార్ నివాసానికి చేరినట్లు ఆదివారం నాటి పరిణామాల నేపథ్యంలో తెలుస్తోంది. సయోధ్య కోసం కొందరు నిర్మాతలు ఆదివారం చిరంజీవిని ఆశ్రయించారు. ఇరువర్గాలతో సంప్రదింపులకు తాను సిద్ధమనీ, ఈ సమస్యకు తానో పరిష్కారం చూపుతానని చిరంజీవి అభయం ఇచ్చినట్లు నిర్మాతలు సి. కల్యాణ్, నట్టికుమార్ చెప్పారు. అదే నిజమైతే రెండు వారాలుగా కొనసాగుతోన్న సినీ కార్మికుల సమ్మె పరిష్కారం కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో మరో ముందడుగు పడి, కార్మికుల సమ్మెకు ఓ పరిష్కారం దొరుకుతుందని ఇండస్ట్రీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అయితే సోమవారం చిరంజీవి ఫెడరేషన్‌తో చర్చలు జరుపుతారని నిర్మాత నట్టికుమార్ చెప్పిన మాటలపై కొందరు సంశయాన్ని వెలిబుచ్చుతున్నారు. గతంలో సమ్మె పరిష్కారం కోసం చిరంజీవి చొరవ చూపుతున్నారంటూ వచ్చిన వార్తలను ఆయన నిర్మొహమాటంగా ఖండించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అయితే నట్టికుమార్ మాట నిజమవుతుందా? చిరంజీవి శుభవార్త చెబుతారా? అనే ఆసక్తి మాత్రం ఇప్పుడు అంతటా నెలకొంది.



కార్మికులతో చిరంజీవి మాట్లాడతానన్నారు: సి. కల్యాణ్

టాలీవుడ్ కార్మికుల సమ్మె విషయంలో మొదట్నుంచి చిరంజీవి పేరు ప్రముఖంగా వినిపిస్తున్నా ఆయన మాత్రం బయట ఎక్కడా స్పందించింది లేదు. సమ్మె పరిష్కారం కోసం ఇండస్ట్రీలోని అగ్రనిర్మాతలంతా ఆదివారం చిరంజీవితో సమావేశమవుతారని శనివారం ఉధృతంగా ప్రచారం జరిగింది. ఏం జరిగిందో కానీ ఆదివారం అగ్ర నిర్మాతల్లో ఎవరూ చిరంజీవిని కలవలేదు. కానీ ఆదివారం ఉదయం నిర్మాత సి. కల్యాణ్ ఒక్కరే చిరంజీవిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'కార్మికుల సమ్మె సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు చిరంజీవి గారు ప్రతి రోజూ మాతో మాట్లాడుతున్నారు. త్వరలోనే ఈ సమస్యకు ఓ పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు. 'ఒక పెద్దమనిషిగా ఇరు వర్గాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో చిరంజీవి ఉన్నారు, తనవంతుగా కార్మికులతో మాట్లాడతానన్నారు' అని తెలిపారు. 'చిన్న నిర్మాతలు బాగా ఇబ్బందులు పడుతున్నారు, నా అనుభవంతో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను ఆయనకు వివరించాను. ఫెడరేషన్ గతంలోనే నిర్మాతల ప్రతిపాదనలను అంగీకరించినా, వారి బలహీనతల వల్లే అవేవీ అమల్లోకి రాలేదు సినిమా షూటింగ్స్ అనేవి ఓ కుటుంబ వాతావరణంలో జరగాలి తప్ప, కార్మిక చట్టాల ప్రకారం సినిమాలకు పనిచేయించడం కుదరదు' అని కల్యాణ్ అన్నారు.

చిరంజీవి మాట వింటామని ఫెడరేషన్ చెప్పింది: నట్టికుమార్

ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం నిర్మాత నట్టి కుమార్ ఆధ్వర్యంలో పలువురు చిన్న నిర్మాతలు చిరంజీవిని కలిశారు. సినిమాల నిర్మాణంలో తాము ఎదుర్కొంటున్న కష్టాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నట్టికుమార్ మీడియాతో మాట్లాడుతూ 'ఫెడరేషన్‌తో సమావేశమై వారి వాదన కూడా వింటాననీ, త్వరలోనే శుభవార్త చెబుతానని చిరంజీవి చెప్పారు. చిన్న సినిమాలకు ఇబ్బందిరాకుండా చూడాలని మేం ఆయన్ను కోరాం. నిర్మాతల ఇబ్బందులను వివరించాం. మా ప్రతిపాదనలకు చిరంజీవి సానుకూలంగా స్పందించారు, పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. సోమవారం ఫెడరేషన్ నాయకులతో సమావేశమవుతానని చెప్పారు. 'చిరంజీవి ఏం చెబితే అది తూచా తప్పకుండా పాటిస్తామ'ని ఫెడరేషన్ చెప్పింది కాబట్టి ఈ సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నాను' అని నట్టికుమార్ తెలిపారు. అయితే సి. కల్యాణ్, నట్టికుమార్ వ్యాఖ్యలపై గానీ, జరుగుతున్న పరిణామాలపై గానీ ఇప్పటివరకూ ఫిల్మ్ ఛాంబర్ కానీ, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కానీ స్పందించలేదు. మరి చిరంజీవి స్వయంగా పూనుకొని, ఈ సమస్యకు ఓ పరిష్కారం చూపుతారా, కార్మికులతో సమ్మెను విరమింజేస్తారా, లేదా అనేది వేచిచూడాలి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పవన్.. రాజకీయ తుపాను



రజనీకాంత్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, సినీ హీరో పవన్ కల్యాణ్‌ను సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ తుపాన్‌గా అభివర్ణించారు. ఆ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ఆదివారం చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. తాజాగా రజనీకాంత్ 50 యేళ్ళ సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సంగతి తెల్సిందే. ఆ సందర్భంగా రజనీకాంత్‌కు పవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందేశానికి రజనీకాంత్ ప్రతిస్పందించారు. 'ఏపీ ఉప ముఖ్యమంత్రి, నా సోదరుడు, పొలిటికల్ సైక్లోన్ పవన్ కళ్యాణ్ గారు.. ప్రేమతో చెప్పిన విషెస్‌కు ఉప్పొంగిపోయా. మీ విషెస్‌ను ఓ గౌరవంగా భావిస్తున్నా. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని రజనీకాంత్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

నిధి డబుల్ ధమాకా


'హరిహర వీరమల్లు' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు నిధి అగర్వాల్. ఆమె ప్రస్తుతం 'రాజాసాబ్'లో కథానాయికగా నటిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు మారుతి ఈ హారర్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. ఆదివారం నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



మరో హారర్ థ్రిల్లర్‌లో నిధి

నిధి అగర్వాల్ మరో హారర్ థ్రిల్లర్ చిత్రంలో నటించనున్నారు. ఆమె పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఈ చిత్రాన్ని ప్రకటించి, ఆమె లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నిఖిల్‌కార్తీక్.ఎన్ దర్శకత్వంలో పుప్పాల అప్పలరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దసరాకు టైటిల్‌ను ప్రకటించనున్నారు.

క్రీడా నేపథ్యంలో..




విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. సిజా రోజ్ కథానాయిక. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా మేకర్స్ 'అర్జున్ చక్రవర్తి' టైటిల్ సాంగ్‌ని ఆవిష్కరించారు. విక్రాంత్ రుద్ర సాహిత్యానికి విఘ్నేష్ భాస్కరన్ స్వరాలు సమకూర్చారు. దీపక్ బ్లూ, సత్యకుమార్, విఘ్నేష్ పాయ్ ఆలపించారు. ఈ చిత్రంలో హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు.

వినోదం ఖాయం



ఎన్.ఎన్.ఆర్.చౌదరి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'నేను... నా లల్లి'. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ "నేను నా లల్లి' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. ఆద్యంతం ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తడం ఖాయం. ఈ చిత్రంలో పాటలు కూడా రాశాను' అని చౌదరి తెలిపారు. కథానాయిక తస్లీమ్ మాట్లాడుతూ 'కుంటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే పాత్ర నాది. చక్కటి సినిమా చూశామన్న అనుభూతి ప్రతి ఒక్కరికీ కలుగుతుంది' అని అన్నారు.



హీరో డాలీ ధనంజయ, సప్తమి గౌడ ప్రధాన పాత్రల్లో సుకేష్ నాయక్ దర్శకుడిగా చారిత్రక నేపథ్యంతో తెరకెక్కుతోన్న చిత్రం 'హలగలి'. యార్లగడ్డ లక్ష్మీ శ్రీనివాస్ సమర్పణలో కల్యాణ్ చక్రవర్తి ధూళిపాళ్ల నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ధనంజయను ఓ యోధుడిగా పరిచయం చేస్తూ గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డాలీ ధనంజయ మాట్లాడుతూ "నిర్మాత కల్యాణ్, డైరెక్టర్ సుకేశ్ చాలా ప్యాషన్‌తో ఈ ప్రాజెక్టుని రూపొందిస్తున్నారు. తప్పకుండా సినిమా ఒక మంచి అనుభూతిని ఇవ్వబోతుంది. అందరి అంచనాలను అందుకుంటుంది' అని అన్నారు.

ప్రకాశం బ్యారేజికి పెరిగిన వరద ఉధృతి


బ్యారేజి దిగువకు వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి పెరిగింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు, ప్రధాన వాగుల నుంచి 2,85,392 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదు అయిందని ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.3 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా దిగువకు 2,82,358 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాల్వకు 2,518, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు వదులుతుండగా.. గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు.

జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని పడమట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో జరగనున్న అండర్ 15 బాల బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు.. జిల్లా జట్టును స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.రవి ఆదివారం ప్రకటించారు. వేజెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో.. ఎంపికలు నిర్వహించారు.

బాలుర జట్టు: ఎ.అరుణ్ కుమార్, డి.బ్రహ్మం (పెదకూరపాడు), వి.బాలాజీ నాయక్, ఎ.బాలు మహేంద్ర (గుంటూరు), కె.భువన సాయి (పెదకూరపాడు), ఎం.అజయ్ (తాడేపల్లి) స్టాండ్ బై లుగా పి.సోహెల్, పి.ఆల్విన్.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా వాలీబాల్ జట్లు

బాలికల జట్టు: ఎస్.సువర్ణ (వీబీ సిద్ధార్థ), ఎస్.నేహా (పెదకూరపాడు), జి.నాగూర్ బీ, వై.నందిని, ఎ.నాగమల్లేశ్వరి (వేజెండ్ల), సీహెచ్ నవీన (మంగళగిరి) స్టాండ్ బైలుగా ఎ.దుర్గా లక్ష్మీ, వి.లక్ష్మీ రేణు (పెదకూరపాడు).

అంబటి ఆరోపణలు హాస్యాస్పదం

పొన్నూరుటౌన్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని చింతలపూడిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నూరు పొలాలు ఎప్పుడైనా అంబటి చూశారా.. కనీసం దారులైనా తెలుసా అని ప్రశ్నించారు. కొమ్మమూరు బ్రిడ్జి నిర్మాణం కాంట్రాక్టర్ అంశంపై గత ప్రభుత్వ హయాంలో జరిగిందని, దానిని కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం మూడు విడతలు నోటీసులు ఇచ్చిందని.. ఈ అంశం మీద బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని.. అంబటి సిద్ధమా అని సవాల్ విసిరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖను పారదర్శకంగా నిర్వహిస్తున్నారన్నారు. పంట పొలాల మునక ఫొటోలు గ్రాఫిక్స్‌లో చూపారని, అమరావతి ముంపునకు గురికాకుండా ఆ నీటినే పొన్నూరుకు పంపారని రాజకీయ నిరుద్యోగులు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. అమరావతి చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలను రెచ్చగొట్టే కుట్రతో అంబటి వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

బోధనేతర పనులు ఆపకుంటే ఉద్యమిస్తాం

ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఆపకుంటే ఉద్యమిస్తామని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ అన్నారు. ఆదివారం నరసరావు పేటలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ముఖ్యుల సమావేశం జరి గింది.



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ జోసఫ్ తదితరులు

సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి అధ్యక్షత వహిం చారు. జోసఫ్ సుధీర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను పాఠాలు బోధించకుండా తరగతికి దూరం చేయడమే ప్రభుత్వ విధానంలా కనిపిస్తోందన్నారు. మూల్యాంకనం కోసం కొత్తగా అసెస్మెంట్ బుక్‌లను ప్రవేశపెట్టారని, ఒక్కో ఉపాధ్యాయుడు మౌఖిక పరీక్షల విద్యార్థుల ప్రతిస్పందనలను వందలాది పేజీలు రాయాల్సి ఉంటుందన్నారు. ఒక ఉపాధ్యాయుడు ప్రైమరీ తరగతులకు బోధిస్తే 240 పేజీలు, ఉన్నత తరగతులకు బోధిస్తే 147 పేజీలు గరిష్ఠంగా విద్యార్థి ప్రతిస్పందనలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇన్ని పేజీలు నమోదు చేస్తుంటే ఉపాధ్యాయులకు బోధనకి ఎక్కడ సమయం ఉంటుందని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులు విద్యార్థులకు పరీక్షలు పెడుతున్నారా, ఉపాధ్యాయులకు పరీక్షలు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. ఇప్పటికే మోడల్ స్కూల్ పేరిట ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల మూలంగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తరలివెళ్లారన్నారు. ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం.సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.గంగాధర్ బాబు, రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకట కోటయ్య, సీహెచ్ అనిల్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏమండీ, జిల్లా గౌరవ అధ్యక్షుడు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల నిషేధం.. నిరంకుశ చర్య

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పలు పుస్తకాలను నిషేధిస్తూ.. ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎన్.భావన్నారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, రాజ్యాంగ నిపుణులు ఏజీ నురానీ, విద్యావేత్త సుమంత్రా బోస్ వంటి పలువురు ప్రముఖులు రాసిన 25 పుస్తకాలను నిషేధించారని వివరించారు. కశ్మీర్ ప్రజల స్థితిగతులతో పాటు వారి మనోభావాలపై ఎన్నో పరిశీ లనలు, పరిశోధనలు చేసి అక్కడి వాస్తవ పరిస్థితులను పుస్తకాల రూ పంలో తెచ్చారని తెలిపారు. అటువంటి పుస్తకాల ప్రచురణ, కొను గోళ్లపై గవర్నర్ వేటు వేయడం ప్రజల స్వేచ్ఛాయుత హక్కులను పూ ర్తిగా హరించడమేనని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించకుండా.. ఇటువంటి చర్యలు చేపట్టడం దారుణమన్నారు. పహల్గాంలో ఉగ్రవా దుల దాడుల పరిణామాల నేపథ్యంలో ప్రజల్లో విశ్వాసం కల్పించేం దుకు తగిన దిద్దుబాటు చర్యలు అవసరమన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కె.జి.శంకర్, ప్రొఫెసర్ ఎన్. వేణుగో పాలరావు, వీవీకే సురేష్, నిర్బంధ వ్యతిరేక ఫోరం నాయకుడు కె.రవిచంద్ర, కాపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, పాల్గొన్న కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత శంకర్ నాయక్

వినుకొండటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత శంకర్ నాయక్ అన్నారు. వినుకొండ జాషువా కళా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. జాతి భవిష్యత్తు కోసం, అభ్యున్నతి కోసం ఉద్యమ బాట మొదలుపెట్టి ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రతి గిరిజన ప్రాంతాల్లో చేరేలా పోరాడాలన్నారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలిపి ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, బీఎస్పీ కార్యదర్శి రాజు, జరపల కృష్ణా నాయక్, హనుమంతు నాయక్, రంగ నాయక్, విష్ణు నాయక్, బాలాజీ నాయక్, డాక్టర్ కోటేశ్వరరావు నాయక్, సైదా నాయక్, మాచర్ల జడ్పీటీసీ మల్లు సామి, సర్పంచ్ బ్రహ్మం, రాంజీ నాయక్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న గిరిజన నాయకులు

వరి, పత్తి సాగులో శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి

లాంఫాం(తాడికొండ)ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న వేళ వరి, పత్తి పంటలు వేసే రైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. వెంకటరాములు, కోఆర్డినేటర్ ఎన్. వెంకట లక్ష్మి సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా వరి నారుమడి నీట మునిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పత్తి పంటను ఇంకా విత్తని రైతులకు పలు సూచనలు తెలియజేశారు. నారుమ డిలో లేదా ఆరు తడి వరి సాగు పొలాల్లో విత్తనం చల్లిన రెండు నుంచి మూడు రోజుల వయసులో మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. నారు విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీటిలో మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. మునిగిన నారుమడి లో నుంచి ఐదు రోజుల లోపు నీరు పూర్తిగా బయటకు తీసివేసిన తర్వాత 5 సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలి, ఒక గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బెండిజం మాంకో జెబ్ లను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. వరి పంట పిలకల దశలో మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరానికి 20 కి లోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనంగా వేసుకో వాలని సూచించారు. పత్తి పంటను ఒక ప్రాంతంలోని రైతులందరూ ఒకేసారి విత్తుకున్నట్లయితే గులాబీ రంగు పురుగు సమస్యను తగ్గించవచ్చన్నారు.

వాటర్ బాటిల్ కోసం గొంతు కోశాడు

శావల్యాపురం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య చోటు చేసుకొన్న వాగ్వివాదం ముదిరి.. మరో వ్యక్తి గొంతుకోసిన ఘటన శావల్యాపురంలోని గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనున్న షాపు వద్ద శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన వూట్ల శ్రీనివాసరావు ట్రావెల్స్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి 11.30 సమయంలో వినుకొండలో పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తూ.. వాటర్ బాటిల్ కోసం శావల్యాపురం పీహెచ్‌సీ సమీపంలోని షాపు వద్ద ఆగాడు. అదే సమయంలో చిన్నకంచెర్లకు చెందిన పూరేటి గణేష్ కూడా వాటర్ బాటిల్ కోసం అక్కడికి వచ్చాడు. ఇద్దరూ తమకే ముందుగా వాటర్ బాటిల్ ఇవ్వాలని షాపు యజమానిని ఒత్తిడి చేశారు. అనంతరం ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. ఇద్దరూ కొట్లాడుకొనే సమయంలో గణేష్ పక్కనున్న ఉల్లిపాయలు తరిగే కత్తితో శ్రీనివాసరావు మెడపైన కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. క్షతగాత్రుడు శ్రీనివాసరావును స్థానికులు వినుకొండలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ లోకేశ్వరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకొన్నారు. శ్రీనివాసరావును కుటుంబ సభ్యులు ఆదివారం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నిందితుడు గణేష్ ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లమడ ఆధునికీకరణ చేపట్టాలి : కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు పేర్కొన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఆదివారం నల్లమడ రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలు రాకపోవడం వల్ల నల్లమడ వాగులో పైనుంచి వచ్చే వర్షాల వల్ల ఈ ప్రాంత భూములు చౌడుబారి వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయన్నారు. 2019లోనే గుంటూరు చానెల్‌కు పరిపాలన అనుమతులు ఇచ్చినప్పటికీ భూ సేకరణ పూర్తికాలేదన్నారు. కానీ, ప్రజాప్రతినిధులు నిధులు కేటాయించామని ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. నల్లమడ వాగు ఆధునికీకరణ చేపట్టకపోవడం వల్ల ఈ ప్రాంతంలో వరదలు వచ్చి ఏటా వేలాది ఎకరాలు పంటలు నీట మునిగి రైతులు నష్టాలు బారిన పడుతున్నారన్నారు. 2017లో రూ.360 కోట్లు ఆధునికీకరణకు పరిపాలన అనుమతులు లభించాయని దాని ప్రకారమే ఆధునీకరణ చేపట్టాలని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అకారణంగా మహిళా రైతులు, రైతులపై కేసులు బనాయించారని వాటిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, గోవాడ సత్యనారాయణ, ఈదర భ్రమరాంబ, మన్నవ హరిప్రసాద్, జాష్టి వీరయ్యచౌదరి, కొల్లా నిర్మల, రామన్, మొవ్వా పెద్దన్న, వెలినేని సత్యనారాయణ, హనుమంతరావు, వెంకయ్యచౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

లాంచీ స్టేషన్ ఆదాయం రూ. 1,88,150


కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండను పర్యాటకులు ఆదివారం భారీగా సందర్శించారు. నాగసిరి, శాంతిసిరి,అగస్త్య లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. కొండలోని మ్యూజియంలో గల బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం సందర్శించారు. అనుపులోని యాంఫీ థియేటర్, అశ్వమేధ యజ్ఞశాల, రంగనాథ స్వామి ఆలయం, అనంతరం 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల అందాలను వీక్షించారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ.1,88,150 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

రామాంజనేయపురంలో పాఠశాల ఏర్పాటు చేయిస్తా

● ఉపాధ్యాయులను కూడా నియమించేలా చూస్తా
● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బెల్లంకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం లోని రామాంజ నేయపురంలో ప్రభుత్వ పాఠశాలను సత్వరమే ఏర్పాటు చేయి స్తానని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వెల్లడించారు. 'చదువు వారికి సాహసమే' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయిన కథనానికి ఆయన స్పందించారు. రామాంజనేయపురంలో ఎంత మంది విద్యార్థులు ఉంటారు.. వాళ్ల రోజూ పాఠశాలకు వెళ్లేందుకు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారు.. అన్న వివరాలను ఎమ్మెల్యే సేకరించిన అనంతరం ప్రకటన చేశారు. అక్కడి విద్యార్థులు అక్కడే చదువుకొనేలా పాఠశాల ఏర్పాటు చేయ డంతో పాటు, అవసరం అయిన ఉపాధ్యాయులను కూడా నియమిస్తామని స్పష్టం చేశారు. తన నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా అది తన వ్యక్తిగత సమస్యగానే భావిస్తానని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. విద్యార్థులు చదువుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ప్రచురితం అయిన కథనం తనను కదిలించిందన్నారు. రామాంజనేయపురంలో విద్యార్థులు ఎదుర్కొంటు న్న సమస్యను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతిని ఎమ్మెల్యే అభినందించారు.

తుంగభద్రలో యువకుడి గల్లంతు


ప్రశాంత్ (ఫైల్‌ఫొటో)

చుండూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్రలో జారిపడి యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం ఉదయం దుండిపాలెం వద్ద జరిగింది. చుండూరు తహసీల్దార్ దేవరకొండ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిపాలేనికి చెందిన యడ్లపల్లి ప్రశాంత్ (20) ఇంటి సమీపంలో ఉన్న తుంగభద్ర కాలువలో కాళ్లు కడుక్కునే క్రమంలో జారిపడిపోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, స్థానికులు అధికారు లకు సమాచారం అందించారు. ప్రశాంత్ ఆచూకీ కోసం కాలువ వెంట వివిధ బృందాలు తనిఖీ చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు. విషయం తెలుసుకున్న రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని తెనాలి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో ప్రశాంత్ ఆచూకీ కోసం ప్రత్యేకంగా టీమ్‌ను ఏర్పాటు చేసి కాలువ వెంట గాలింపు చేపట్టారు. సాయంత్రం వరకు ప్రశాంత్ ఆచూకీ లభించలేదని అధికారులు తెలిపారు.

మట్టి పరీక్షలు మమ

(5వ పేజీ తరువాయి)

సాగును రైతులు చేపట్టారు. వచ్చే నెలాఖరుకు ఖరీఫ్ సీజన్ కూడా ముగియనున్నది. రబీకైనా సదరు పత్రాలు అందుతాయన్న నమ్మకం రైతులకు కలగడంలేదు.

పరీక్షలతోనే పోషకాల నిర్ధారణ..

పుడమిలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాల స్థాయి(పీహెచ్)తో పాటు పాస్పరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోదుతులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ పరీక్షల ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలను అధికారులు అటకెక్కించారు. సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరంగా ఉంది. ఖరీఫ్‌లో సూక్ష్మపోషకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలానే సాగితే రైతులు ప్రభుత్వం అందజేయనున్న సూక్ష్మపోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలిరూరల్,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కారు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి సుల్తానాబాద్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంగలకుదురుకు చెందిన కిరాణా షాపు నిర్వాహకుడు పువ్వాడ సుబ్బారావు (72) ఆదివారం తెనాలి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు అతడిని ఢీ కొట్టింది. తీవ్రగాయాలతో ఉన్న సుబ్బారావును స్థానికులు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మార్గ మధ్యలోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై త్రీటౌన్ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

(5వ పేజీ తరువాయి)

కారణంగా వారికి పనిభారం పెరిగి మొత్తంగా వ్యవస్థ దెబ్బతింటోంది. యాప్‌లు, రికార్డుల నిర్వహణ భారం కారణంగా ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. ఫలితంగా అంగన్వాడీల నిర్వహణ లక్ష్యాలకు దూరంగా జరిగిపోతోంది.

పనిచేయని ఫోన్లు.. తలనొప్పిగా యాప్‌లు

అంగన్వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లను నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్లో ప్రతి రోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నమోదు చేయాలి. వీటితోపాటు నెలకు రెండు సార్లు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేయాలి. నెలకు ఒక సారి మిల్క్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. అయితే సరుకులన్నీ ఒకేసారి రాకపోవడంతో వాటిని వేరు వేరు సమయాల్లో యాప్‌లో నమోదు చేయాల్సి వస్తోంది. టేక్ హోమ్ కిట్లలో ఇచ్చే సరుకులు మొత్తం ఒకేసారి రాకపోవడంతో గర్భిణులు, బాలింతలు పలు మార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనికి తోడు ఎప్పుడో పాతకాలం నుంచి వాడుతున్న మొబైల్స్ పనిచేయకపోవడం, యాప్‌లకు సపోర్టు చేయకపోవడం వంటి కారణంగా యాప్‌ల నిర్వహణ పెద్ద తలనొప్పిగా మారింది. ఆ కారణంగా లబ్ధిదారులు ఒకటికి పదిసార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొందరైతే వదిలేసుకుంటున్నారు. అలా వారి వివరాలు నమోదు కాకపోతే మరుసటి నెల నుంచి సరుకుల సరఫరా ఆగిపోతోంది. ఆ కారణంగా మరుసటి నెల సరుకుల కొరత వచ్చి లబ్ధిదారుల ఆగ్రహానికి అంగన్వాడీలు గురవుతున్నారు. చివరకు లబ్ధిదారుల ఆగ్రహావేశాలతో ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారు.

ఆరు రకాల రికార్డుల మోత

అంగన్వాడీ ఉద్యోగులపై రికార్డుల మోత అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారి విన్నపాన్ని మన్నించి రికార్డుల భారాన్ని తొలగిస్తూ జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఎవరూ ఫిజికల్ రికార్డులు నిర్వహించాల్సిన పనిలేదు. కానీ ఆరు రికార్డులు నిర్వహించాలని అధికారులు హుకుం జారీ చేశారు. ఫుడ్ కంజంప్షన్ రికార్డు(ఎఫ్‌సీఆర్), పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ పోషణ రికార్డు (ఎస్ఎన్‌పీ), ప్రతి రోజూ గర్భిణి, బాలింతల రికార్డుతో పాటు ప్రతి నెలా మంత్లీ ప్రాజెక్టు రిపోర్టు(ఎంపీఆర్), అంగన్వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డుతో పాటు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ సహా మొత్తం ఆరు రకాల రికార్డులను ఉద్యోగులు నిర్వహించాల్సి వస్తోంది. ఫలితంగా విధుల్లో నాణ్యత తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో యాప్‌లు నిర్వహించలేమని మొబైల్స్ సెరండర్ చేసి ఉద్యోగులు నిరసన తెలిపారు. అధికారుల సర్దుబాటుతో ఆ విషయం అంతటితో ఆగింది. తక్షణమే యాప్‌ల నిర్వహణకు తగిన ఫోన్లు ఇచ్చి, రికార్డుల నిర్వహణను నిలిపివేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. పనిభారం తగ్గించి, న్యాయమైన వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

పిడుగురాళ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పిడుగురాళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుదె నరసింహారావు, గుత్తా పేరయ్య, కొమ్మ మహేష్, వేల్పూరి సైదాచారి, షేక్ రంజాన్‌వలి, పఠాన్ సైదా, కరిముల్లా, అంజనేయులు, మహేష్‌రెడ్డి, ఆరిఫ్, బాబూరావు, ఢీకొండ రామారావు తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం కారంపూడిలో ఘనంగా నిర్వహించారు. చెక్‌పోస్టు సెంటర్ నుంచి నాగులేరు బ్రిడ్జి వరకు ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వెంకటప్పయ్య, కార్యవర్గ సభ్యుడు వీరేంద్ర, మండల అధ్యక్షుడు బాణావత్ రాజేష్‌నాయక్, కార్యదర్శి అల్లి కరుణాకర్, కోశాధికారి కల్లూరి గోపి, సురేష్, జానీబాషా, మగ్బుల్ జానీబాషా, భవిరిశెట్టి రామారావు, సూరేపల్లి కోటేశ్వరరావు, సముద్రాల సాయి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి చేయూత నివ్వండి

● గ్రామస్థుల వేడుకోలు

అచ్చంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోగంటివారిపాలెంలో రామాలయాన్ని పునర్నిర్మించాలని స్థానిక పెద్దలు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్‌కు విన్నవించారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్, ఆలయ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రామాలయాన్ని పునర్నిర్మించుకొనేందుకు నిధులు సమకూర్చుకుంటామని, మరికొన్ని నిధులు విశ్వ హిందూ పరిషత్ సహకరించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు రవికుమార్‌తో పాటు భూరక్ష మట్టపల్లి సుబ్బరాయుడు, జిల్లా గోరక్ష ప్రముఖ్ తుమ్మా మర్రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

సత్తెనపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ హనుమంతరావును మాజీ ఏపీపీ భగ్గి నరసింహారావు ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, న్యాయవాదులు, ఆదివారం పూలమాలలతో ఘనంగా సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో జరిగిన వేడుకల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్నందుకు ఈ సన్మానం చేశారు. కార్యక్రమంలో మారెళ్ళ మల్లేశ్వరరావు, మారెళ్ళ స్వామి, దివ్వెల శ్రీనివాసరావు, బీఎల్ చిన్నయ్య, కట్టా శంకరరావు, జాకీర్, హనుమంతరావు, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఉన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

పిడుగురాళ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తుమ్మలచెరువు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కాటూరి మెడికల్ కళాశాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. తుమ్మలచెరువుతో పాటు సమీప గ్రామాల నుంచి సుమారు 200 మందికి పైగా హాజరుకాగా వైద్యులు శ్రీసన, దీపిక, అభిలాష్, ఆషిక, అమీనా, విద్యాధర్, పునీత, విద్యాలహరి, హారికలు హాజరై అన్నిరకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి, గుండె, ఆర్థోపెడిక్ విభాగాల్లో ఎక్కువ మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రెంటచింతల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోలి గ్రామానికి చెందిన పీట్ల రామయ్య(32) గోలి అడ్డరోడ్డులోని ఆలయం వద్ద అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున ఆదివారం చెప్పారు. శరీరం మీద ఎక్కడ గాయాలు లేనప్పటికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి పీట్ల చిన్న ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

గురజాలటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ బాయిలై ఒక్కసారిగా విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని విద్యుత్ అధికారులు తెలిపారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. స్థానికులు సమాచారం ఇవ్వగానే విద్యుత్ అధికారులు స్పందించడంతో ఎటువంటి హాని జరగలేదు.

విద్యానగర్.. సమస్యలతో సతమతమతం

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు
- తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇక్కట్లు

క్రోసూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని విద్యానగర్ వాసులు దశాబ్దాలుగా సమస్యలతో సతమతమవుతున్నారు. కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండి చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్ల పైనే చేరుతుంది. కాలనీలో అంతర్గత రహదారులు మట్టి రోడ్లుగా ఉండటంతో బురదమయంగా దర్శనమిస్తుంది. కాలువలు లేకపోవటంతో మురుగునీరంతా రోడ్లపైనే నిలిచిపోతుంది. అనేక సార్లు అధికారులకు తమ పరిస్థితి మొరపెట్టుకున్నా ఎవ్వరూ ఆలకించటం లేదని స్థానికులు చెపుతున్నారు. తమ కాలనీకి మంచినీటి సౌకర్యం కూడా లేదని, వాడుకోవటానికి కూడా నీటి సమస్య ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవటం వల్ల దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, కాలనీ వాసులు తరుచుగా జ్వరాల భారిన పడుతున్నారని స్థానికులు తెలిపారు.



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మూడున్నర దశాబ్దాలుగా సమస్యలు ఎదుర్కొంటున్నాం : కర్నాటి కృష్ణారావు

విద్యానగర్ ఏర్పడి 35 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు అభివృద్ధికి నోచుకోలేదు. అంతర్గత రహదారులన్నీ మట్టి రోడ్లుగా ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారిపోతున్నాయి. కాలనీలో సిమెంట్ రోడ్ల కోసం అనేకసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. ముఖ్యంగా మురుగుపారే సౌకర్యం లేకపోవటంతో గృహాల్లోని మురుగునీరంతా రోడ్లపైనే నిలిచిపోతుంది. అధికారులు కాలనీ అభివృద్ధిపై శ్రద్ధ చూపాలి.



విద్యానగర్‌లో చిత్తడిగా ఉన్న అంతర్గత రహదారి

విజయోత్సవ ర్యాలీకి తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు



ట్రాక్టర్లతో ర్యాలీగా దుర్గి నుంచి తరలివెళ్తున్న రైతులు

దుర్గి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సారథ్యంలో మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే అన్నదాత సుఖీభవ పథకం విజయవంతం చేయడానికి ఆదివారం దుర్గి మండలం నుంచి రైతులు భారీగా ట్రాక్టర్లతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముందుగా బస్టాండ్ సెంటర్లో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు యాగంటి నరేష్, దుర్గెంపూడి జానకి రామయ్య, శెట్టిపల్లి నరసింహారావు, కటకం రామ్మోహనరావు, మేకల దాసు, మాగులూరి నారయ్య, పగడాల చెన్న కేశవులు, సింగు నాగేశ్వరరావు, అప్పారావు, వడ్లపల్లి శ్రీనివాసరావు, కప్పెర అల్లూరయ్య, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రెంటచింతల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాలకు చెందిన 70 ట్రాక్టర్లలో టీడీపీ నేతలు అన్నదాతలు సుఖీభవ విజయోత్సవ ర్యాలీకి భారీగా తరలి వెళ్లారు. మండలంలో సుమారు 6000 మంది దాకా సుఖీభవ పథకం కింద లబ్ధిపొందారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, శౌర్రెడ్డి, రామకృష్ణ, రాజ్‌కుమార్, సామ్యేలు, కోటి, బుజ్జి, అప్పయ్య, ఇన్నారెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీ కార్యక్రమంలో ధారునాయక్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన యాదవ్, మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్ చైర్‌పర్సన్ యర్రాకుల సిద్దమ్మ సిద్ధయ్య యాదవ్, పంగులూరి అంజయ్య, పుల్లయ్య, డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్, యాగంటి మల్లికార్జునరావు, కుర్రి శివారెడ్డి, వజ్రం నాయక్, కళ్లం రామాంజిరెడ్డి, బూసా రామాంజనేయులు, గుండా శ్రీనివాసరావు యాదవ్, కొమెర దుర్గారావు, నేరేటి వీరాస్వామి, యేచూరి సాయిశంకర్, లింగా రమేష్, జూలకంటి అక్కిరెడ్డి, పోకూరి కాశీపతి, కొమెర శివ, బెల్లంకొండ కృష్ణ, ఉన్నం మహేష్, కంభంపాటి అనిల్, బండ్ల శ్రీను, చప్పిడి రాము, బోడపాటి రామకృష్ణ, సుమంత్‌రెడ్డి, కృష్ణవేణి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

వర్షాల ఉధృతికి ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసం

● మోర్జంపాడు, పిల్లుట్ల గ్రామాల మధ్య ప్రయాణికుల అవస్థలు



మోర్జంపాడు, పిల్లుట్ల గ్రామాల మధ్య వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు



తుఫాన్ వర్షాలకు మోర్జంపాడు పిల్లుట్ల గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మాచవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల వల్ల వివిధ గ్రామాల్లోని ఆర్‌అండ్‌బీ రోడ్లు వరదల ఉధృతికి ధ్వంసమయ్యాయి. మోర్జంపాడు, పిల్లుట్ల గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోవడమే కాకుండా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ నీరు ఉందో అర్థం కాక ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పాలవుతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంకమ్మ తల్లికి బోనాలు.. జల బిందెలతో పూజలు



శ్రీ వీర్లంకమ్మ మూలవిరాట్



అమ్మవారికి బోనాలతో తరలి వెళ్తున్న భక్తులు

దాచేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పెద గార్లపాడులోని అంకమ్మ తల్లికి భక్తులు జలబిందెలతో, బోనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏళ్ళ తరబడి అనాదిగా వస్తున్న సంప్రదాయంలో భాగంగా శ్రావణమాసం చివరి ఆదివారం అంకమ్మకి భక్తులు కులమతాలకు అతీతంగా మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత గ్రామంలోని బొడ్రాయి, మహాలక్ష్మి అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. మహిళలు బోనాలతో బయలు దేరగా యువకులు జల బిందెలతో తరలి వచ్చి అమ్మవారికి పూజా కార్యక్రమాలు చేపట్టారు. సుమారుగా రెండు వేల మందికి పైగా యువతీ యువకులు బోనాలు, జలబిందెలతో బయలుదేరి రావటం చూపపరులను విశేషంగా ఆకట్టుకుంది. కరువు కాటకాల నుంచి కాపాడాలని, పాడి పంటలతో చల్లంగా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆచారవంతులు, వీరతాళ్ళు వేపాకులతో అమ్మవారికి బోనాలు అందజేశారు. పల్నాటి ప్రాంతంలో అంకమ్మ గ్రామ దేవతగా అధికంగా పూజలు అందుకుంటుంది. సీఐ భాస్కరరావు పర్యవేక్షణలో గ్రామంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

నీట మునిగిన పొలాలు

● పంట కాలువను తీయించాలని కోరుతున్న రైతులు

● చర్యలు తీసుకోవటంలో అధికారుల నిర్లక్ష్యం



నకరికల్లులో తువ్వల ప్రాంతంలో వర్షపు నీటికి మునిగిన పొలాలు

నకరికల్లు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నకరికల్లు తువ్వలు ప్రాంతంలో వరుసగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు నిలిచిపోతున్నాయి. నకరికల్లులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు దక్షిణ భాగాన తువ్వల పొలాలు ఉన్నాయి. వరుసగా వర్షం కురిసినప్పుడల్లా పొలాలు నీటమునిగి పోతున్నాయి. ఈ విషయంపై ఈ ప్రాంత రైతులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ సమస్య మాశాఖ పరిధిలోది కాదంటే మా శాఖ పరిధిలోని కాదంటూ అధికారులు ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నామని, ఎవరికి చెబితే ఈ సమస్య పరిష్కారమవుతుందో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు ఉన్న కాలువ పూడిపోవటం వల్ల నీరు నిల్వ ఉంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు నిధులను వెచ్చిస్తే కాలువ బాగు చేయవచ్చని, కాలువ బాగు చేస్తే పొలాల్లో నీరు నిల్వ ఉండదని రైతులు చెపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి కాలువను బాగు చేసి పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు సుబ్బయ్య, వెంకటరావు, నరసింహారావు కోరుతున్నారు.

నారికేళి అలంకరణలో గంగమ్మ

పిడుగురాళ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఆదివారాన్ని పురస్కరించుకొని స్థానిక గంగమ్మ దేవాలయంలో అమ్మవారిని కొబ్బరికాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కొక్కెర కొండలు సౌకర్యాలు ఏర్పాటుచేశారు.



నారికేళి అలంకరణలో అమ్మవారు

పిడుగురాళ్లలో శ్రీకృష్ణుడి ఊరేగింపు



శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

పిడుగురాళ్ల, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణుడి విగ్రహం ఊరేగింపు నిర్వహించారు. మాచర్ల రోడ్డులోని హరివిల్లు అపార్ట్‌మెంట్ నుంచి పట్టణ పురవీధుల్లో భగవద్గీత శ్లోక పారాయణం చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు, కె.అరుణ, కార్తీక్, నారాయణమ్మ, అనురాధ, వెంకటలక్ష్మీ, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందరం, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు



పాత బస్టాండ్ సెంటర్‌లో సర్వీస్ రోడ్డుపై నిలిచిన వాహనాలు

దాచేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయి నుంచి మండల స్థాయికి అభివృద్ధి చెందిన దాచేపల్లిలో ట్రాఫిక్ సమస్య ప్రజలను ఇబ్బంది పెడుతుంది. గ్రామంలో వాహనాల రద్దీ పెరగటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ స్థలాలుగా వాహనాలు నిలపటం, పూల కొట్లు, అరటికాయల బండ్లు రోడ్ల పైకి రావటంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. నగర పంచాయతీగా అభివృద్ధి చెందిందేగాని పన్నుల మోత తప్ప ప్రజల కనీస వసతులను కూడా ఏర్పాటు చేయటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించకపోవటం ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దాచేపల్లి పాత బస్టాండ్ సెంటర్‌తో పాటు నారాయణపురం లోని ఆంధ్రా బ్యాంక్, సొసైటీ బ్యాంక్ వద్ద వాహనాలు పార్కింగ్ చేయటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసు అధికారులు, నగర పంచాయతీ అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

● ఎస్‌ఐ చల్లా సురేష్

నకరికల్లు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని పురస్కరించుకొని విగ్రహాలను ఏర్పాటు చేసే విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్‌ఐ చల్లా సురేష్ స్పష్టం చేశారు. మైకును పూజల సమయంలోనే వినియోగించాలన్నారు. ఊరేగింపులకు ముందుగా అనుమతి తీసుకోవటంతో పాటు రాత్రి 9 గంటల నుంచి 10 గంటల లోపే ముగించాలన్నారు. మందుబాబులను ఊరేగింపులకు దూరంగా ఉంచాలన్నారు. విగ్రహాల ఏర్పాటులో ఆధ్యాత్మిక ధోరణిలో కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు.

అభివృద్ధి, ఆరోగ్యం రెండు కళ్లు

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే జూలకంటి



కారంపూడిలో సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కూటమికి అభివృద్ధి, ఆరోగ్యం రెండు కళ్లలాంటివని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా 43 మంది లబ్ధిదారులకు రూ.37.60 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం విషమించి అత్యవసర పరిస్థితిలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మల్లీశ్వరి మధుసూదనయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవని

కారంపూడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవని అని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కారంపూడికి చెందిన నాగేటి రాంబాబుకు సీఎం రిలీఫండ్ నుంచి మంజూరైన రూ.45 వేల చెక్కును ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టీడీపీ కారంపూడి పట్టణ మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, సాగినబోయిన నాగరాజు, తోకల శ్రీనివాసరావు, నాగేటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకం మహిళలకు ఎంతో ఉపయోగం

● రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి పథకం మహిళలకు ఎంతో ఉపయోగ పడుతుందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. ఆదివారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం కేవలం ఆర్థిక భారాన్ని తగ్గించే పథకమే కాదు, మహిళల జీవితాల్లో ఆత్మగౌరవాన్ని నింపే పథకమని తెలిపారు. గడిచిన 60 గంటల్లో ఆర్టీసీ బస్సుల్లో 16 లక్షల మందికి పైగా ఉచితంగా మహిళలు ప్రయాణించారని తెలిపారు. మండలంలోని మహిళలంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లను అభినందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, టీడీపీ నాయకులు పీఎస్‌కే రసూల్, కొండవీటి అబ్దుల్ రజాక్, మునగపాటి సుభానీ, అహమ్మద్, ఎన్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం

● కోలాట బృందంచే ఉత్సవమూర్తుల గ్రామోత్సవం



ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

రాజుపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలో ఉన్న పద్మావతీ గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం ఆలయ ధర్మకర్త పొత్తూరి వెంకటరమ సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. సీతా రామాంజనేయ కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో ఆటల పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

లోక కల్యాణార్థం భాగవత సప్తాహిక యజ్ఞం

అమరావతి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా మండలపరిధిలోని పొందుగల గాయత్రీ తీర్థం శ్రీరామకృష్ణ శాంతి ఆశ్రమంలో ఈ నెల 11నుంచి 17వ తేదీ వరకు భాగవత సప్తాహిక యజ్ఞం జరిగింది. కార్యక్రమంలో మొదటి మూడు రోజులు భాగవతా యజ్ఞం, నాలుగో రోజు రుక్మిణీ కల్యాణం, చివరి మూడు రోజులు రాజసూయ యజ్ఞం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కనకదుర్గమ్మవారికి బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

మాచర్ల రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంను పురస్కరించుకొని పట్టణంలోని కేసీపీ ఫ్యాక్టరీ రోడ్డులో ఉన్న శ్రీకనకదుర్గమ్మకి ఆదివారం మహిళలు బోనాలు సమర్పించారు. మేళతాళాల నడుమ ర్యాలీగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై స్తంభించిన ట్రాఫిక్

రొంపిచర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలోని కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై ఆదివారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. సుబ్బయ్యపాలెం క్రాస్ రోడ్‌లో భారీ లారీ మరమ్మతులకు గురై నిలిచిపోవటంతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రాత్రి 7:30గంటల నుంచి 9:30గంటల వరకు ట్రాఫిక్ నిలిచిపోయి ఉంది. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వాహన చోదకులు సమాచారం అందించారు. 9.30గంటల సమయంలోనూ ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు సిబ్బంది ఎవరూ అందుబాటులోకి రాలేదు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నరసరావుపేటలో ఘనంగా డాక్టర్ విలియం కేరీ జయంతి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని మున్సిపల్ వసతి గృహంలో ఆదివారం డాక్టర్ విలియం కేరి 256 జయంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ విలియం కేరి మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ, పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిస్వార్థ నాయకుడు ఖాసింఖాన్: చీఫ్ విప్ జీవి

వినుకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా పోరాడిన గొప్ప నాయకుడు వినుకొండ మాజీ సర్పంచ్ పఠాన్ ఖాసింఖాన్ అని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పఠాన్ ఖాసింఖాన్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పెద్ద మసీదు సెంటర్లో ఉన్న ఖాసింఖాన్ విగ్రహానికి ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినుకొండ రోడ్డులోని శ్రీనివాస గిరిజన కాలనీలో శనివారం రాత్రి తెలుగుదేశం పార్టీకి చెందిన ఉయ్యాల శివక్రిష్ణ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసిన బీరు బాటిళ్ళు విసిరారు. బయటకు వచ్చి చూస్తే ఎవరు కనిపించలేదని ఉయ్యాల శివకృష్ణ తెలిపారు. గతంలో శివకృష్ణకు అదే కాలనీకి చెందిన వైసీపీ నాయకుల మధ్య కొంత కాలంగా వివాదం జరుగుతోంది.

ఘనంగా అంకమ్మ తల్లి కొలుపులు

రొంపిచర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురుమెళ్ళలోని అంకమ్మ తల్లి కొలుపులు ఆదివారం వైభవంగా జరిగాయి. మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

వినుకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గ పరిసరప్రాంత ప్రయాణికులకు, తీర్థయాత్రికులకు ఆగస్టు 18వ తేదీన తమిళనాడులోని అరుణాచలం, గిరిప్రదక్షిణంకు వినుకొండ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. తిరుత్తణి, శివకంచి, విష్ణు కంచి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, శ్రీకాళహస్తిలను దర్శించుకుని 21న ఉదయం 6గం.వినుకొండ చేరుతుందని తెలిపారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.2550 నిర్ణయించినట్లు వివరించారు.

21, 22 తేదీలలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

యడ్లపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సామినేని చారిటబుల్ ట్రస్టు, హైదరాబాద్‌కు చెందిన కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఈ నెల 21, 22 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. బోయపాలెం అనంతలక్ష్మీ స్పిన్నింగ్ మిల్లులో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు రోజులపాటు ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సంగం పాడి రైతులకు రూ.3.16లక్షల బోనస్ అందజేత

నాదెండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రు పాల ఉత్పత్తిదారుల సంఘానికి చెందిన రైతులకు రూ.3.16లక్షల బోనస్‌ను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ పాలక మండలి సభ్యులు శ్రీనివాసరావు, అధ్యక్షుడు మెడబలిమి ప్రతాప్, మేనేజర్ నరేష్ బాబు, సూపర్ వైజర్ వసంతరావు పాల్గొన్నారు.

తెలుగు మహిళ, డాక్టర్ల విభాగాల ఎన్నిక ఏకగ్రీవం

చిలకలూరిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ తెలుగు మహిళ, నియోజకవర్గ డాక్టర్ల విభాగాల కమిటీల ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. తెలుగు మహిళ అధ్యక్షురాలుగా 22వ వార్డు కౌన్సిలర్ కూనల ప్రమీల, ప్రధాన కార్యదర్శిగా యాదాల సుజాతలు ఎన్నికయ్యారు. నియోజకవర్గ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడిగా డాక్టర్ పేర్ని కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మారెళ్ల ఇందిరలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నెల్లూరి సదాశివరావు, కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, ఎం.రవి, జె.మదన్ మోహన్, బి.సత్యనారాయణ, కె.సాయిబాబు, ఎం.మల్లిబాబు, అజహరుద్దీన్ పాల్గొన్నారు.

శ్రీకోదండ రామాలయ నూతన కమిటీ ఎన్నిక

నాదెండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని కోదండ రామాలయం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా తాత వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జె.వెంకటరత్నం, కోశాధికారిగా జి.బుచ్చయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎస్.శివయ్య, ఉపాధ్యక్షుడిగా జి.ఆదినారాయణలు ప్రమాణ స్వీకారం చేశారు.

తీరిన సాగునీటి కష్టాలు

● కాలువల మరమ్మతులతో తీరిన రైతుల వ్యథ

● చివరి భూముల వరకు సాగునీరు



మరమ్మతులు పూర్తయిన శానంపూడి మేజర్

శావల్యాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనతో అన్నదాతలు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు తెరపడింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అద్దంకి బ్రాంచ్ కెనాల్, మేజర్, మైనర్ కాలువల వైపు కన్నెత్తయినా చూడకపోవడంతో చివరి భూముల వరకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలువ కట్టలపై పిచ్చిచెట్లు, గడ్డి పెరిగి పొలాలకు వెళ్లాలంటే రైతులకు సమస్యగా మారింది. సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉండి చివరి భూములవరకు సాగునీరు చేరేది కాదు. దీంతో పంట పొలాలు బీడు భూములుగా మారాయి. ఐదేళ్లు పిచ్చిచెట్లు పీకించకపోవడంతో వాటి వేళ్లు కాలువకట్టల్లోకి పోవడంతో కట్టలు కూడా బలహీనంగా మారి సాగునీరు వృథా అవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీరు వృథా కాకుండా చివరి భూముల వరకు చేర్చాలన్న సంకల్పంతో అద్దంకి బ్రాంచ్ కెనాల్, దాని పరిధిలోని మేజర్, మైనర్ కాలువలపై ప్రత్యేక దృష్టి సారించి కాలువలకు సాగునీరు చేరేలోపే మరమ్మతులు పూర్తి చేసింది. అంతేకాక ఎన్నికల



పిట్టంబండ్ల మేజర్‌లో పారుతున్న సాగునీరు

హామీల్లో కూటమి ప్రకటించిన ఏడాదికి రూ.20వేల పెట్టుబడిసాయంలో మొదటి విడత రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. దాంతో కూటమి పాలనపై రైతులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. శావల్యాపురం మండలం గంటవారిపాలెం డీసీ నెంబర్-25 పరిధిలోని 9సాగునీటి సంఘాలకు ప్రభుత్వం రూ.60లక్షలు నిధులు మంజూరు చేయగా టెండర్ ప్రక్రియ ద్వారా మరో రూ.49.80 లక్షలను మంజూరు చేసింది. వాటితో డీసీ-25 పరిధిలోని వేల్పూరు, అలవాల, అన్నవరప్పాడు, గంటవారిపాలెం, పోట్లూరు, ఏనుగుపాలెం-1, 2, శానంపూడి-1, 2, పిట్టంబండ్ల, కామేపల్లి సాగునీటి సంఘాల అధ్యక్షులు వారి పరిధిలోని మేజర్ కాలువలు, మైనర్ కాలువలకు మరమ్మతులు నిర్వహించారు. కాలువల్లో పూడిక తీయించి కాలువకట్టల వెంబడి పెరిగిన పిచ్చిచెట్లు, గడ్డిని తొలగించి కాలువకట్టలను పటిష్టం చేశారు. చాలా కాలం తర్వాత కాలువల్లో సాగునీరు పారుతుండడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. రైతులు వరినారు పోసుకొనేందుకు ప్రభుత్వం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ప్రస్తుతం 560 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తుంది. కారుమంచి సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే 750 క్యూసెక్కుల నీరువిడుదల చేయనున్నారు. దాంతో అన్ని మేజర్, మైనర్ కాలువలకు సాగునీరు చేరుతుంది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా మండలంలోని 11సచివాలయాల పరిధిలో 6517మంది రైతులకు రూ.4,56,19,000 మొదటి విడత పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. దాంతో రైతులు పంటసాగుకు సన్నద్ధం అవుతున్నారు. కూటమి అందిస్తున్న సుపరిపాలనపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఐనవోలు టీడీపీ కార్యకర్త కటికల విజయ కుమార్ భార్యకు రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం

నూజెండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనవోలు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కటికల విజయ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఐనవోలు డీసీ చైర్మన్ రావుల బుజ్జి, మండల పార్టీ అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి, రేవళ్ళ బుల్లెయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకం సూపర్ సక్సెస్: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం సూపర్ సక్సెస్ అయిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం చెప్పారు. చిలకలూరిపేటలోని తన నివాసంలో నాదెండ్ల మండలంలోని పలు గ్రామాలకు చెందిన 33 మందికి రూ.18.21 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్తిపాటి స్త్రీశక్తి పథకంపై వైసీపీ నేతలు కావాలనే బురద జల్లుతున్నారన్నారని విమర్శించారు. సుపరిపాలన, సూపర్-6 అమలుతో చంద్రబాబు గ్రాఫ్ ఆకాశాన్ని తాకుతుంటే, పులివెందుల ఓటర్లు ఇచ్చిన షాక్‌తో జగన్ గ్రాఫ్ నేలవాలిందని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి మహిళలలో మంచిపేరు రావడాన్ని సహించలేకనే వైసీపీ నేతలు స్త్రీశక్తి పథకంలో లొసుగులు వెతికే పనిలో పడ్డారన్నారు. ఉచిత బస్సు ప్రయాణంలోని చిన్నచిన్న లోపాలను భూతద్దంలో చూపి వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం గోరంత అయితే పథకం అమలుతో రెండ్రోజుల్లోనే చంద్రబాబు పట్ల మహిళల్లో ఏర్పడిన అభిమానం కొండంత అని ఆయన చెప్పారు. చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో లొసుగులు వెతకడంపై పెట్టే శ్రద్ధలో పావవంతు, వైసీపీ నేతలు తమ నాయకుడి మానసిక జాడ్యాన్ని సరిచేయడంపై పెడితే మంచిదన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్న రాజకీయ నిరుద్యోగులకు ప్రజలే తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. నాదెండ్ల మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, సీనియర్ టీడీపీ నాయకులు తేళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

శ్రీ రామకృష్ణ ఓరియంటల్ పాఠశాల

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రూ.10 లక్షల విలువైన ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. గత నెలలో జరిగిన పాఠశాల వజ్రోత్సవాలకు పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు తరలివచ్చారన్నారు. పాఠశాల భవనానికి పూర్వ విద్యార్థులు మరమ్మతులు చేయించి, రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దారన్నారు. అదేవిధంగా పాఠశాల ఆటస్థలాన్ని కూడా అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ఇతర పాఠశాలలను కూడా ఆయా పూర్వ విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పీ4 ద్వారా ఈ ప్రహరీ నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ డీఈ రఫీ చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం బీ సత్యనారాయణ సింగ్, రిటైర్డ్ హెచ్ఎం వై.త్యాగరాజు, పూర్వ విద్యార్థులు కపలవాయి విజయకుమార్, వీవీ ఆంజనీకుమార్, జూలకంటి సీతారాంజనేయులు, కొత్తూరు హనుమంతరావు, సరికొండ రామరాజు, ఎన్.సత్యనారాయణ ప్రసాద్, బెల్లంకొండ ఈశ్వరరావు, మండల వెంకటేశ్వరరావు, టి.మస్తానరావు, షేక్ యాసిన్, సిద్దు నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, మడక శివప్రసాదు, షేక్ బాజీ, రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం 25న చలో కలెక్టరేట్

ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కౌలురైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ అన్నారు. ఆదివారం చలో కలెక్టరేట్ ధర్నాలో కౌలురైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలంటూ మండలంలోని కేసానుపల్లి, చిన్నతురకపాలెం, చింతలపాలెం, గోనెపూడి, గురువాయిపాలెం, కొండకావూరు, అచ్చమ్మపాలెం, పెట్లూరివారిపాలెం, అర్వపల్లి, ఉప్పలపాడు, లింగంగుంట్ల, ఇక్కుర్రు, అల్లూరివారిపాలెం, పాలపాడు, రావిపాడులలో కరపత్రాలు పంచుతూ ఆటో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వై రాధాకృష్ణ మాట్లాడుతూ భూమిలేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ, ఇతర పథకాలు వర్తింపజేయాలన్నారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు మంజూరుచేసి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2లక్షల వరకు ఎటువంటి హామీ లేని పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ప్రత్యేక రాయితీలు, పంట రుణాలు అంటూ ఆర్భాటంగా ప్రచారాలు చేసుకోవడమే తప్ప అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కౌలు గుర్తింపు కార్డుల వలన ప్రయోజనం దక్కడం లేదన్నారు. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో కౌలు రైతులను గుర్తించి ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీచేసి ఆదుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలో 7.50 లక్షల ఏకరాలలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, అపరాలు తదితర పంటలు పండిస్తున్నారని, సొంత భూమి సాగుదారులు 35 నుంచి 40 శాతం మాత్రమే సాగుచేస్తుంటే కౌలు రైతులు 60 నుంచి 65శాతం సాగు చేస్తున్నారన్నారు. పల్నాడు జిల్లాలో 1.50లక్షల మందికిపైగా కౌలురైతులు ఉంటే 65వేల మందికి కౌలు గుర్తింపు కార్డులు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిదన్నారు. అవికూడా పూర్తి స్థాయిలో మంజూరు చేయలేదని మండిపడ్డారు. జిల్లాలో ప్రతి కౌలు రైతును గుర్తించి రాయితీలు, పంట రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి టీ పెద్దిరాజు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకృష్ణ తదితరులు

నరసరావుపేటలో అధ్వానంగా పారిశుధ్యం

● పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. నరసరావుపేట పట్టణంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. నరసరావుపేట పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్డు, కుమ్మరి బజారు, షాలెంనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని గత 10రోజులుగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం లేదని పట్టణంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసరెడ్డి

కోలాహలంగా ఉట్టికొట్టే కార్యక్రమం

వినుకొండ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం రాత్రి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని చేసిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం దేవస్థానానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కనపర్తి వెంకట్రావు, ఎండ్లూరి సతీష్, గాలం బ్రహ్మాజీ, జడా వెంకటరావు, బత్తుల రాజయ్య, గాలం ప్రసన్న, నర్ర శ్రీనివాసరావు, పట్టణ పురప్రముఖులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.



ఉట్టికొట్టేందుకు పోటీపడుతున్న భక్తులు

● రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెంలో కృష్ణాష్టమి సందర్భంగా కృష్ణుడి విగ్రహం వద్ద శనివారం రాత్రి పూజలు జరిగాయి. చిన్నారులకు కృష్ణుడి వేష ధారణ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

యోగ శిక్షణ శిబిరం ముగింపు ఆనంద మహోత్సవం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న 7వ యోగ శిక్షణ శిబిరం ముగింపు ఆనంద మహోత్సవం ఆదివారం జరిగింది. వెంకటేశ్వరయోగ సేవ కేంద్రం 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. 28రోజులు పాటు శిక్షణకు హాజరైన, శ్లోకాలు అప్పజెప్పిన వారికి ప్రతిభపురస్కారాలను నిర్వాహకులు జెల్లి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎ.వెంకటేశ్వరయోగి, జి.శ్రీనివాసరావు, ఎం.వీరాంజనేయులు, పి.లక్ష్మీనారాయణ, కె.శివప్రసాదరావు, కె.శారద, బి.కొండారెడ్డి, యోగా సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

బొల్లాపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అరుంధతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకరికి నిత్యావసరాల పంపిణీ ఆదివారం జరిగింది. మండలంలోని బొల్లాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన శిఖా కోటేశ్వరరావు 40రోజులుగా అనారోగ్యంతో మంచం పట్టాడు. అరుంధతి సేవా సేవా ఫౌండేషన్ అధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, నిత్యవసరాలు అందజేశారు. కార్యక్రమంలో గర్నెపూడి ఈశ్వరయ్య, కట్టెపూడి బర్న, శిఖా రామయ్య, బాబూరావు, పున్నయ్య, దాసు, పత్రా లింగయ్య, పెద్దింటి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



బొల్లాపల్లిలో నిత్యావసరాలు అందచేస్తున్న కోటేశ్వరరావు, తదితరులు

గంజాయి కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితులైన 18మంది నిందితులను చిలకలూరిపేట రూరల్ పరిధిలోని నాదెండ్ల పోలీసులు ఈ నెల 16న అరెస్టు చేశారు. ఆదివారం చిలకలూరిపేట న్యాయాధికారి నరేంద్రరెడ్డి ఎదుట హాజరుపరిచారు. గంజాయి విక్రయానికి పాల్పడిన ఏడుగురికి రిమాండ్ విధించారు. వీరిలో ఒక మైనరును విజయవాడ జువైనల్ హోమ్‌కు తరలించారు. గంజాయి వినియోగదాలు 11మందికి వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది.

నేడు అద్దె గర్భం కేసులో నిందితుల కస్టడీకి పిటిషన్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అద్దె గర్భం కేసులో అరెస్టయిన నిందితులను విచారించేందుకు పోలీసుల కస్టడీకి నేడు కోర్టులో పిటిషన్ వేయనున్నారు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ పద్మానగర్‌లోని ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా అద్దె గర్భం (సరోగసీ) కేంద్రాన్ని చిలకలూరిపేటకు చెందిన నర్రెద్దుల లక్ష్మీరెడ్డి అలియాస్ లక్ష్మి (50), ఆమె కుమారుడు నరేందర్‌రెడ్డి (25) నిర్వహిస్తున్నారు. సులువుగా పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చన్న ఆశతో సరోగసీ పద్ధతిని ఎంచుకున్నారు. అయితే పేట్ బషీరాబాద్, మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డీఎంహెచ్‌వో సంయుక్త దాడితో గుట్టుగా సాగిపోతున్న వీరి దందా బయటపడింది. ఈ కేసులో అరెస్టయిన తల్లీ కొడుక్కి ఇప్పటికే కోర్టు రిమాండు విధించగా, ప్రస్తుతం జైలులో ఉన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా వారిని విచారించేందుకు పేట్ బషీరాబాద్ పోలీసులు సోమవారం కస్టడీ పిటిషన్ వేయనున్నారు. కాగా, ఈ కేసులో ఇప్పటికే ఏడుగురికి నోటీసులు పంపించారు. నోటీసులు తీసుకున్న వారిలో ఆరుగురు లక్ష్మీరెడ్డి ఇంట్లోనే నివాసం ఉంటున్నట్లు తెలిసింది.

అట్లాంటాలో మీట్ అండ్ గ్రీట్ విత్ గోనుగుంట్ల

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని అట్లాంటాలో ఆదివారం ప్రవాసాంధ్రులతో మీట్ అండ్ గ్రీట్ విత్ గోనుగుంట్ల కోటేశ్వరరావు కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావును ప్రవాసాంధ్రులు ఘనంగా సత్కరించారు.



గోనుగుంట్ల కోటేశ్వరరావును సత్కరిస్తున్న ప్రవాసాంధ్రులు

బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆర్థికసాయం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న కార్యాలయంలో బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆదివారం పేద విద్యార్థికి ఆర్థికసాయం చేసింది. బొల్లు రాజేశ్వరి 27వ వర్ధంతి సందర్భంగా గోళ్ళపాడు ముప్పాళ్ళ మండలం కుందూరివారిపాలెంకు చెందిన బొక్కిసం విజయలక్ష్మికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. బొక్కిసం విజయలక్ష్మి నరసరావుపేటలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు మాట్లాడుతూ తాను చిన్నప్పుడు చదువుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డానని చెప్పారు. అందువలన ప్రతిభ గల పేద విద్యార్థులకు సాయం చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొల్లు రాజేంద్రప్రసాదు, కోమటినేని నాసరయ్య, బొల్లు వెంకటేశ్వర్లు, బీఎస్ఎన్ఎల్ వరప్రసాదు, మర్లపాటి రామకృష్ణ, గార్లపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు, ట్రస్ట్ సభ్యులు

ఇస్కాన్ మందిరంలో శ్రీల ప్రభుపాదుల వ్యాసపూజ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బరంపేటలో ఉన్న ఇస్కాన్ మందిరంలో ఆదివారం శ్రీల ప్రభుపాదుల వారి 129వ వ్యాసపూజ ఆదివారం జరిగింది. శ్రీల ప్రభుపాదులకు మహాశంఖాభిషేకం నిర్వహించారు. తదుపరి 108 తినుభండారములతో మహారాజభోగ నివేదన జరిగింది. శ్రీల ప్రభుపాదుల వారి గురించి ప్రవచనం, అనంతరం సంపూర్ణ ప్రసాద వితరణ జరిగింది, ఆయా కార్యక్రమాలలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా శనివారం రాత్రి ఉత్సవమూర్తులకు 56 రకముల ద్రవ్యాలతో మహాశంఖాభిషేకం, 108 రకాల భక్ష్యంలతో మహారాజభోగ నివేదన జరిగింది.



శ్రీల ప్రభుపాదుల వారికి 108 పదార్థాలతో మహారాజభోగ నివేదన, పాల్గొన్న భక్తులు



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న చదలవాడ అరవిందబాబు

విద్యతోనే సూర్య బలిజల అభివృద్ధి సాధ్యం

● నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

గుంటూరు (విద్య) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్య అనే ఆయుధంతో అన్ని విధాలా ఎదిగేందుకు కృషి చేయాలని నరసరావుపేట శాసనసభ్యుడు చదలవాడ అరవిందబాబు సూచించారు. ఆదివారం సూర్య బలిజ విద్యా సంఘం ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయం కొరటాల సమావేశ మందిరంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు అందజేశారు. విద్య సంఘం అధ్యక్షుడు చదలవాడ రఘురాం సభకు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో విద్యావేత్త డాక్టర్ దాసరి కృష్ణారావు, విద్యాసంఘం కార్యదర్శి మద్దెల కైలాసనాథబాబు, కోశాధికారి సిద్ధాబత్తుని విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.